# జెనీవా WTO చర్చలు.. విఫలం

ప్రపంచ వాణిజ్యాన్ని మరింత సరళీకృతం చేసే దిశగా.. జెనీవాలో ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) ఆధ్వర్యంలో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (World Trade Organisation -WTO) డైరెక్టర్ జనరల్ పాస్కల్ లామీ మాట్లాడుతూ... అమెరికా, చైనా, భారత్... తమ దేశాలకు సంబంధించిన దిగుమతుల అనుమతుల విషయంలో పట్టువీడకపోవటంతో.. WTO చర్చలు విఫలమయ్యాయని జెనీవాలో ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ వాణిజ్య కమిషనర్ పీటర్ మాండల్సన్ కూడా చర్చలు విఫలమవటం పట్ల విచారం వ్యక్తం చేస్తూ... కొన్ని దేశాల మొండిపట్టు వల్లే చర్చలు ఫలప్రదం కాలేదన్నారు. ప్రపంచ వాణిజ్యాన్ని మరింత సరళీకృతం చేసి... ఆంక్షలు, సరిహద్దులులేని ప్రపంచ వాణిజ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకునే దిశగా.. 2001లో దోహాలో ప్రారంభమైన ప్రపంచ వాణిజ్య చర్చలు... ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నచందంగా మారాయి. ఎన్నిసార్లు చర్చలు జరిగినా.. ఆశించిన పురోగతి లేక, చివరకు జెనీవాలో.. 2008, జూలైలో జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి. దాంతో ప్రపంచ వాణిజ్య సంస్థ అస్థిత్వం.. భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసుకోదలచిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు కూడా అగమ్యగోచరంగా మారాయి.

## చర్చలెందుకు విఫలమయ్యాయి?:

వ్యవసాయోత్పత్తుల దిగుమతులకు సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రతిష్టంభన ఏర్పడటంతో... ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్యదేశాల మధ్య చర్చలు విఫలమయ్యాయని నిపుణుల అభి ప్రాయం. విదేశాల నుంచి చవకగా వచ్చిపడే వ్యవసాయ దిగుమతుల నుంచి.. తమ దేశాలలో ఉన్న రైతులను ఎలా కాపాడుకోవాలి?.. అలా కాపాడుకోవాలంటే.. విదేశాల నుంచి వచ్చే ఆ దిగుమతులపై ఎంత శాతం దిగుమతి సుంకాన్ని విధించాలి..? తమ తమ దేశాల్లో వ్యవసాయదారులకు ఇచ్చే సబ్సిడీ ఎంత స్థాయిలో ఉంచాలి..? అనే విషయంపై... అమెరికా, యూరోపియన్ యూనియన్, ఆసియా దేశాల మధ్య అవగాహన కుదరలేదు. దాంతో 2008, జూలై నాటి జెనీవా చర్చలు ముందుకు సాగలేదు. అమెరికా, యూరోప్ దేశాల్లో రైతులకు ఇచ్చే విపరీతమైన సబ్సిడీల వల్ల... వారి ఉత్పత్తులు చవకగా లభ్యమ వుతాయని... ఆ చవక ధరకు లభించే వ్యవసాయోత్పత్తులు తమ మార్కెట్లను ఇబ్బడి ముబ్బడిగా ముంచెత్తితే...తమ దేశ వ్యవసాయదారుల ఉత్పత్తులు వాటితో పోటీపడలేవని... తమ వ్యవసాయ రంగం చితికిపోతుందనీ... అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాల వాదన.

తమ తమ దేశాల్లోని పేద రైతుల జీవితాన్ని పణంగా పెట్టే ఒప్పందాన్ని అంగీకరించేకంటే... అసలు ఒప్పందం కుదుర్చు కోకపోవటమే మేలని ఈ దేశాలు భావించాయి. భారత్, చైనాలు తమ దేశ రైతులను

కాపాడుకోవటం పైనే ధ్యాస పెట్టాయి, కానీ... ఒప్పం దం కుదుర్చుకునేందుకు తమ తమ ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లలో సరళీకరణ దిశగా చేయాల్సిన మార్పులపై దృష్టి సారించలేదని... ఈ దేశాల రక్షణాత్మక వైఖరి వల్లే చర్చలు విఫలమయ్యాయని.. అమెరికా ఆరోపించింది. అయితే, వ్యవసాయోత్పత్తుల విషయం.. ముఖ్యంగా ఆహార భద్రతకు, జీవనోపాధికి సంబంధించినదనీ.. ఈ విషయంలో తొందరపాటు ప్రదర్శించి.. భవిష్యత్తు తరాల జీవనోపాధిని పణంగా పెట్టబోమని భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన భారత వాణిజ్య మంత్రి కమల్‌నాథ్ వ్యాఖ్యానించారు.

పెరుగుతున్న చమురు ధరలు.. దాని ఫలితంగా దెబ్బతిన్న తమ ఆర్థిక వ్యవస్థలలో ఆకాశాన్ని అంటుతున్న ఆహార పదార్థాల ధరలు.. పొంచి ఉన్న ఆహార సంక్షోభం కూడా ఆయా సభ్య దేశాలను రక్షణాత్మక వైఖరిని అవలంభించే దిశగా ప్రభావితం చేశాయని పరిశీలకుల అభిప్రాయం. అభివృద్ధి చెందిన దేశాల నుంచి ఇబ్బడిముబ్బడిగా వచ్చే చవక దిగుమతులను ఎదుర్కోవటానికి... తమ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, తాత్కాలికంగా ఆంక్షలు విధించే హక్కును కలిగి ఉండటం.. తమ దేశ కనీస బాధ్యతని.. తమకు అది జీవిత బీమా లాంటిదని అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. అయితే, వాణిజ్యాన్ని అభివృద్ధికి సాధనంగా ఉపయోగించుకోవాలని.. అనేక దేశాలు ఆహారధాన్యాల అధిక ధరలను, ఆహారధాన్యాల కొరతను ఎదుర్కొంటున్న సమయంలో.. చవక దిగుమతుల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలకు లాభమే గాని, నష్టముండదని.. ఈ ఒక్క విషయంపై మొండి వైఖరి ప్రదర్శించి, చర్చలను ముందుకు సాగనీయకపోవటం వల్ల.. అభివృద్ధి చెందుతున్న దేశాలే ఎక్కువగా నష్టపోతాయని... ప్రపంచ వాణిజ్య సంస్థ డైరెక్టర్ జనరల్ పాస్కల్ లామీ అభిప్రాయం. ప్రపంచీకరణ నేపథ్యంలో.. సరళీకృత ఆర్థిక విధానం ద్వారా, స్వేచ్ఛ వాణిజ్యం ద్వారా.. అభివృద్ధి ఫలాలను అన్ని దేశాలకూ అందేలా చూడాలనే... ప్రపంచ వాణిజ్య సంస్థ ఆశయానికి ఈ చర్చల వైఫల్యం విఘాతం కలిగించిందని ఆయన భావన. సంపన్న దేశాల స్వార్థపూరిత ధోరణి వల్లే చర్చలు విఫలమయ్యాయని చైనా ఆరోపించింది. అమెరికా, యూరోపియన్ యూనియన్లు... తమ దేశాలలోని రైతులకు పెద్ద మొత్తంలో ఇస్తున్న వ్యవసాయ సబ్సిడీలను తగ్గించటానికి అంగీకరిం చనందువల్లే చర్చలు విఫలమయ్యాయనీ... ఈ చర్చలు విఫలమవటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దెబ్బని కూడా చైనా పేర్కొంది. భారత్, చైనా లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు... తమ వ్యవసాయ ఉత్పత్తులను... అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలలోని మార్కెట్‌లలోకి ప్రవేశించటానికి అనువైన వాతావరణం కల్పించాలని... అమెరికా, యూరోప్ దేశాలను కోరుతున్నాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల మార్కెట్‌లలోకి ప్రవేశించాలంటే... ఆ దేశాలు, తమ వ్యవసాయదారులకు ఇస్తున్న సబ్సిడీలను తగ్గిస్తే కానీ, సాధ్యం కాదు. ఎందుకంటే.. అత్యధిక సబ్సిడీల ఆధారంగా ఆయా దేశాల్లో తయారైన వ్యవసాయ ఉత్పత్తులు అతి చవకగా లభిస్తాయి. దాంతో అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి వెళ్లే వ్యవసాయ ఉత్పత్తులు..అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల్లో లభించే చవక వ్యవసాయ ఉత్పత్తులతో పోటీపడలేవు. సంపన్న దేశాల్లో వ్యవసాయరంగానికిచ్చే సబ్సిడీలు తగ్గిస్తే...అక్కడ

వ్యవసాయ ఉత్పత్తుల ధర గణనీయంగా పెరుగుతుంది. భారత్–చైనా లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో.. అధిక సంఖ్యలో పనిచేసేవారు లభించటం.. కనీస వేతనం తక్కువ స్థాయిలో ఉండటం.. తదితర అనుకూల కారణాల వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధర తక్కువగా ఉండి.. సంపన్న దేశాల వ్యవసాయ ఉత్పత్తులతో తేలికగా పోటీపడతాయి. సంపన్న దేశాలు తమ సబ్సిడీని తగ్గిస్తేనే ఇది సాధ్యం. సబ్సిడీలను తగ్గించకుండా... తద్వారా తమ మార్కెట్లలోకి అభివృద్ధి చెందుతున్న దేశాల వ్యవసాయ ఉత్పత్తులను పోటీ పడనీయకుండా చేయటమేకాక.. ఆ సబ్సిడీల ఆధారంగా తయారైన ఉత్పత్తులను తిరిగి అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లలోకి ప్రవేశపెడితే.. అభివృద్ధి చెందుతున్న దేశాల వ్యవసాయ ఉత్పత్తులు.. విదేశాల్లోనూ, స్వదేశంలోనూ కూడా పోటీపడలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ విషయమే జెనీవాలో చర్చలు విఫలం కావటానికి ప్రధాన కారణం!

## నేపథ్యం:

ప్రపంచ దేశాల జాతీయ భద్రత సార్వభౌమాధికారాల విషయంలో ఏర్పడే సమస్యలను పరిష్కరించటానికి.. ఐక్యరాజ్యసమితి ఎలా ఏర్పడిందో...అలాగే ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య సంబంధ విషయాలు... పరస్పర చర్చల ద్వారా తత్సంబంధ సమస్యలకు పరిష్కారం కనుగొనాలనే ఆశయంతో... ఏర్పాటయిందే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో). ప్రపంచ దేశాల మధ్య జరిగే వాణిజ్యాన్ని ఒక క్రీడగా భావిస్తే... ఆ క్రీడకు ఒక రిఫరీ అవసరం ఉంటుంది. ఆ రిఫరీలా పనిచేసేదే ప్రపంచ వాణిజ్య సంస్థ. రిఫరీ లేకుంటే.. బలమైన జట్టు, బలహీనమైన జట్టును తొక్కిపారేసే ఆస్కారముంది. డబ్ల్యూటీవో ఏర్పాటుకుముందు, ప్రపంచ దేశాల మధ్య వ్యాపార సంబంధాల్లో ఇలాంటి దమననీతే రాజ్యమేలేది. సంపన్న దేశాలు.. తమ సైనిక, ఆర్థిక శక్తితో.. బలహీనమైన దేశాలను అణగదొక్కేవి. చిన్న, బలహీన దేశాలు తమ సమస్యలు విన్నవించుకోవటానికి వేదిక ఉండేదికాదు. 1995లో జెనీవాలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుతో... మాల్దీవులు వంటి చిన్నదేశం కూడా అమెరికా లాంటి శక్తివంతమైన దేశంతో చర్చించే ఒక ఆస్కారం, అవకాశం ఏర్పడింది. డబ్ల్యూటీవో ఏర్పాటుతో ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య సంబంధాల్లో... ఒక రకమైన క్రమశిక్షణకు ఆస్కారం ఏర్పడింది. స్వార్థపూరిత వాణిజ్య విధానాల నుంచి.. సామూహిక అభివృద్ధి దిశగా.. ప్రపంచ దేశాల వాణిజ్యాన్ని నడిపించే లక్ష్యంతో డబ్ల్యూటీవో ఏర్పాటైన తర్వా త... చిన్న చిన్న దేశాలు కూడా తమ వాణిని వినిపించే అవకాశం కలిగింది.

153 సభ్య దేశాలున్న ప్రపంచ వాణిజ్య సంస్థలో... నిర్ణయాలు ప్రజాస్వామ్యబద్ధంగా తీసుకోవాలి. సభ్య దేశాలన్నింటికీ.. హక్కులు, బాధ్యతలు కల్పించారు. హక్కులు, బాధ్యతల విషయానికి వస్తే.. సభ్య దేశాల మధ్య కుదిరే ఏ ఒప్పందాన్నైనా వ్యతిరేకించే... veto హక్కు ప్రతి సభ్యదేశానికి ఉంది. అలాగే ఇతర సభ్యదేశాలతో.. Most Favoured Nation (MFN) ఒప్పందాన్ని కుదుర్చు కోవాల్సిన బాధ్యత కూడా ఉంది. ఈ ఒప్పందం ప్రకారం... ఇరు దేశాల మధ్య ఉన్న వాణిజ్య ఆంక్షలన్నీ ఎత్తివేసి, స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించాల్సి ఉంది. సభ్యదేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను, మార్కెట్లను సరళీకృతం

చేసి... ఇతర సభ్యదేశాలతో స్వేచ్ఛా వాణిజ్యం దిశగా అడుగులు వేయాల్సిన బాధ్యత ఉంది. అయితే, తమ మార్కెట్లలోకి ఇతర సభ్యదేశాల నుంచి వచ్చే వస్తుసేవల సరఫరాపై ఎలాంటి నియంత్రణలను విధించాలి..? ఒకవైపు స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తూనే..మరోవైపు తమ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కాకుండా కాపాడుకోవటానికి ఎంతమేరకు రక్షణాత్మక చర్యలను అవలంబించాలి..? అనే విషయంపై సభ్యదేశాలన్నింటి మధ్య చర్చల ద్వారా ఒక ఒప్పందం జరగాల్సి ఉంటుంది. అలా ఒప్పందాన్ని కుదుర్చుకోవటానికి... ఆయా సభ్యదేశాల వాణిజ్య మంత్రుల సమావేశం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. దీన్నే Ministerial Conference అంటారు. ప్రపంచ వాణిజ్య సంస్థలో నిర్ణయాలు తీసుకునే అత్యున్నత వ్యవస్థ ఇదే. ప్రపంచ వాణిజ్య సంస్థకు నేతృత్వం వహించేందుకు డైరెక్టర్ జనరల్‌ను కూడా ఈ మినిస్టీరియల్ కాన్ఫరెన్సే ఎన్నుకుంటుంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్... ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ స్వేచ్ఛా వాణిజ్యం దిశగా సాగే మార్గంలో ఏర్పడే అడ్డంకులను, అవరోధాలను, ఆంక్షలను... చర్చల ద్వారా పరిష్కరించి, ఒప్పందాలను కుదుర్చుకునేందుకు వీలు కల్పిస్తుంది!!

### 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటైన తర్వాత..

- 1996లో మొట్టమొదటి మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ సింగపూర్‌లో జరిగింది.
- 1998లో రెండోసారి జెనీవా(స్విట్జర్లాండ్‌లో)లో ఈ సమావేశం జరిగింది .
- 1999లో అమెరికాలోని సియాటిల్‌లో మూడో మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ జరిగింది.
- 2001లో ఖతార్ రాజధాని దోహాలో నాలుగో మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సమావేశంలోనే ప్రపంచ వాణిజ్యంలో... పేదదేశాల అవసరాలను తీర్చటానికి.. సంపన్న దేశాలు, తమ వ్యవసాయ ఉత్పత్తులపై ఇచ్చే సబ్సిడీలను తగ్గించాలనే విషయంపై, విస్తృతమైన చర్చ ప్రారంభమైంది. దీన్నే 'దోహా అభివృద్ధి అజెండా' అన్నారు.
- 2003లో మెక్సికోలోని కాన్‌కున్‌లో ఐదో మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ జరిగింది.
- 2005లో చైనాలోని హాంగ్‌కాంగ్‌లో ఆరో మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ జరిగింది.

### మినిస్టీరియల్ కాన్ఫరెన్స్‌లు.. ముఖ్యవిషయాలు

1) సభ్యదేశాలు జాతీయ మార్కెట్లను, ఇతర సభ్యదేశాల వస్తు సేవల ప్రవేశానికి అనువుగా సరళీకరించటం.
2) సభ్యదేశాలు తమ దేశంలో వస్తుసేవల ఉత్పత్తికి ఇచ్చే సబ్సిడీలను క్రమబద్ధీకరించటం.
3) ఆయా సభ్యదేశాలు, తమ దేశాల నుంచి వెళ్లే ఎగుమతులకు ఇచ్చే సబ్సిడీలను నియంత్రించటం.
4) సేవల రంగంలో.. సభ్యదేశాల మధ్య మానవ వనరుల రాకపోకలపై ఉన్న నియంత్రణలను

తొలగించటం.

5) పెట్టుబడులు..ఉత్పత్తి రంగంలో పోటీ.. ప్రభుత్వ జోక్యం.. ఆయా ప్రభుత్వ చట్టాల్లో పారదర్శకత.. వస్తుసేవల ఉత్పత్తిలో ఆయా సభ్యదేశాల్లో పరిశ్రమలు పాటించాల్సిన కార్మిక ప్రమాణాలు.. ఇతర దేశాల్లో పెట్టుబడి పెట్టిన కంపెనీలకు, వాటి పెట్టుబడులకూ కల్పించాల్సిన న్యాయపరమైన రక్షణ.. తదితర విషయాలు. (వీటిని సింగపూర్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్‌లో చర్చించారు. కాబట్టి సింగపూర్ విషయాలు అంటారు)

SAKSHI